# పందెం



వాణిశ్రీ

**రాం**బాబు పోస్టాఫీసులో కవరొకటి తీసుకుని, తను అదివరకే రాసిపెట్టిన లెటర్ అందులో పెట్టి, నాలికతో తడి చేసి అంటించేశాడు. పోస్ట్ డబ్బాలో వెయ్యబోతూ వుంటే, "అడ్రసు రాయకుండానే కవరు వెళ్తుందా?" అన్నాడు ప్రక్కనే వున్న శంకరం.

రాంబాబు తన పొరపాటు గుర్తించి పెన్ తీసి 'టూ' అని రాశాక అందులో ఇంక్ లేక ఇక రాయనని మొండి కేసింది.

"నీ పెన్ ఇవ్వరా బాబూ" అన్నాడు రాంబాబు.

"పెన్ కార్నర్‌లో రిపేరుకిచ్చాను" అన్నాడు శంకరం.

అక్కడ ఇంక ఎవరూ లేరు పోస్టా

ఫీసు మూసేసే టైమైనందున ఎవరూ వస్తున్న సూచనలు గూడా లేవు. కౌంటర్లో గుమస్తా చాలా సీరియస్‌గా పనిచేస్తూ ఇంటికి వెళ్ళిపోయే మూడ్‌లో వున్నాడు పెన్ అడిగితే ఏం తంటా వస్తుందోనని అడగలేకపోయాడు.

ఇంతలో పదిగజాల దూరంలో నలుగురు అమ్మాయిలు కాలేజీనుంచి వస్తూ కన్పించారు. "వాళ్ళల్లో ఎవర్నయినా అడుగు" అన్నాడు శంకరం.

"రానీ అడుగుతాను" అన్నాడు రాంబాబు

రాంబాబు ఉత్తరకుమారుడికి తమ్ముడేనని శంకరానికి బాగా తెలుసు.

"నీ ముఖం నీకంత. ధైర్యం వుందా?" హేళనగా నవ్వాడు శంకరం.

"ఎంత పందెం?" సీరియస్‌గా అన్నాడు రాంబాబు

"ఓడిపోయినవాళ్ళు సినిమా ఖర్చు, టిఫిన్ ఖర్చు వగైరా భరించాలి" అన్నాడు శంకరం

"ఓ కే" అన్నాడు రాంబాబు.

ఆ నలుగురమ్మాయిలు దగ్గరగా వచ్చారు పోస్టాఫీసు దాటి పదిగజాలు వెళ్ళిపోయారు గూడా.

రాంబాబు వాళ్ళల్లో ఎవర్నీ పెన్ అడగలేదు

శంకరం విజయగర్వంతో నవ్వాడు.

రాంబాబు వున్నట్లుండి పూనకం వచ్చినవాడిలా రోడ్డుమీద కెళ్ళి చప్పట్లు కొట్టి, "లక్ష్మీ...లక్ష్మీ..." అని కేకపెట్టాడు.

వాళ్లు నలుగురూ హఠాత్తుగా ఆగిపోయారు. రాంబాబుని విచిత్రంగా చూస్తూ నిల్చున్నారు.

రాంబాబు పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ వెళ్ళి "పెన్ కావాలి జస్ట్ ఎ మినిట్" అన్నాడు మందహాసం చేస్తూ.

ఎర్రపూల చీర, అదే రంగు బ్లౌజు వేసుకున్న అమ్మాయి పెన్ తీసి ఇచ్చింది.

రాంబాబు కవరుమీద అడ్రసు రాసి పెన్ తిరిగి ఇచ్చేసి "థాంక్స్" అన్నాడు నవ్వు ముఖంతో ఆమె వంక చూస్తూ.

"నో మెన్షన్ ..." అంది ఆ అమ్మాయి

రాంబాబు వెనక్కు తిరిగి వెళ్ళబోయి "రామూ..." అనే పిలుపు విని ఆగిపోయాడు

అదే. ఆ ఎర్రపూల చిన్నది నవ్వుతూ వుంది

రాంబాబు ఆశ్చర్యపడ్డాడు అంతలోనే కంగారుపడ్డాడు.

"ఏం లేదు రామూ మా వాళ్ళంతా 'షోలే'కి మళ్ళీ ఒకసారి వెళ్దామంటున్నారు. ఈ రోజు లాస్ట్. ఇంటికి వెళ్ళి రావడానికి టైమ్ లేదు ఓ టెన్ వుంటే ఇవ్వు," అంది అతని చొక్కా జేబు వంక చూస్తూ.




రాంబాబుకి నోట మాట రాలేదు. గొంతులో తడి ఆరిపోయింది. 'లేవు' అనేదానికి ఆస్కారం కన్పించలేదు. టెర్లిన్ చొక్కా జేబులో పది కాగితం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది.

పది రూపాయిల కాగితం తీసి ఆమె చేతిలో పెట్టి వెనక్కి తిరిగాడు.

"థాంక్స్, రామూ," అంది ఆమె నవ్వుతూ.

"నో మెన్షన్..." అని తొందర తొందరగా పోస్టాఫీసు వైపు వెళ్ళిపోయాడు రాంబాబు.

"చూశావా శశీ, ఈ రోడ్డుమీద డబ్బు ఎలా సంపాదిస్తావ్? నీ కెవరు అప్పు ఇస్తారు! అని పది రూపాయిలు పందెం కాశావుగా. గెలిచాను," అంది లక్ష్మి విజయగర్వంతో.

"అతను నీకు తెలిసినవాడా యేం?" అంది శశిరేఖ అనుమానంగా.

"నో ...నో ... అతని ముక్కూ, మొహం ఇప్పుడే చూడ్డం."

"నీ పేరు అతనికెలా తెలిసింది?"

"అదే అర్థంకావడంలేదు."

"పోనీ. అతని పేరు నీ కెలా తెలుసు?"

"మగవాళ్లల్లో ఎక్కువగా రామూ లుంటారు. అందుకని పిలిచాను. నిజంగా అతను రామూ అవునో కాదో నాకు తెలియదు." అంది లక్ష్మి.

* * *

"ఆ అమ్మాయి నీకు తెలుసా ఏం?" అన్నాడు శంకరం.

"తెలియదు."

"మరి లక్ష్మి అని ఎలా పిలిచావ్?"

"ఆ మాత్రం తెలియదూ? నలుగురు అమ్మాయిలు వుంటే అందులో ఒక లక్ష్మి తప్పకుండా వుంటుంది." అని నవ్వాడు రాంబాబు. తను శంకరం దగ్గర పందెం గెల్చినా లక్ష్మి దగ్గర ఓడిపోయినట్లే. మరి తను పందెం గెల్చినట్లో లేక ఓడినట్లో అర్థంకాలేదు రాంబాబుకి.